

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## అనుబంధాలు

**"ఏరా ప్రయాణం బాగా జరిగిందా?"** అమ్మ కాఫీ గ్లాస్ అందిస్తూ అడిగింది.

"సూపర్" గ్లాస్ అందుకుంటూ చెప్పాను.

"కొంచెం లావైనట్లున్నావ్. నీ ఈడు పిల్లలు జిమ్, జాగింగ్ అంటూంటారు కదా నువ్వు మరీ బద్దకస్థుడైపోతున్నావ్" చెప్పింది.

"అమ్మా! నవలల్లో, సినిమాల్లో గుండ్రాయిలాగా ఉన్న వాడ్ని వాళ్ళమ్మ చిక్కిపోయావురా అంటుంది. ఇది రిడిక్యులస్" అరిచాను.

"సర్లే. ఇకనించి నీ ఫ్లాట్‌కి వెళ్ళేప్పుడు లిఫ్ట్ ఎక్కకుండా మెట్లెక్కి దిగు" సలహా ఇచ్చింది.

"బయటకి వెళ్ళొస్తా" చెప్పాను

"మరి బ్రేక్ ఫాస్ట్?"

"బయటే. లంచ్ టైంకి వస్తా" చెప్పి చెప్పులు వేసుకుని వీధిలోకి వచ్చాను.

నేను మా ఊరు రావడానికి మా అమ్మ ఒక కారణం అయితే మరో కారణం నిత్య. జూనియర్ కాలేజ్‌లో ఇంగ్లీష్ లెక్చరర్‌గా పనిచేస్తోంది. తను నాకోసం ఎదురు చూస్తూ వాళ్ళింటి దగ్గరున్న బస్టాప్‌లో నిలబడి ఉంది.

"హాయ్ హీరోయిన్. ఎలా ఉన్నావ్?" చిన్నగా విజిలేసి అడిగాను.

"ఇలాగ వెళ్దామా?" నిత్య సమాధానం ఆశించకుండా పక్క సందులో పార్క్ చేసిన తన బైక్ దగ్గరకి దారి తీసింది. నేను ఆమె వెనక కూర్చుని మా ఊరి వీధులు చూస్తూ అడిగాను.

"ఏంటి సంగతులు?"

"చెప్తా ఆగు."

బైక్‌ని పాత గుడి బయట ఆపింది. ఆ ఆంజనేయుడి గుడికి ప్రస్తుతం భక్తులెవరూ రావడంలేదు. కొత్తగా ఊరి మధ్యలో కట్టిన సాయిబాబా గుడికే అంతా వెళ్తున్నారు. ఇద్దరం గుడిమెట్ల మీద కూర్చున్నాం.

"చెప్పు ఏంటి సంగతులు?" ఆమె వేళ్ళతో ఆడుకుంటూ అడిగాను.

"మీ అమ్మేం చెప్పలా?"

"అబ్బ సస్పెన్స్‌తో చంపుతున్నావ్. చెప్పరాదూ?" విసుక్కున్నాను.

"మీ సీత బాబాయ్ ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్ తెలుసా?"

"సీత బాబాయా? ఎందుకు?" అయోమయంగా అడిగాను.

"ఆయనకి కొత్తగా ఓ గర్ల్ ఫ్రెండ్ దొరికింది."

"ఛీ!"

"ఛీ కాదు ఆయన ఎప్పుడూ ఆవిడ ఇంట్లోనే" నిత్య కిసుక్కున నవ్వింది.

"ఛ ఛీ! చదువుకున్నావ్. ఐనా బుద్ధిలేకుండా ఈ గాసిప్స్ ఏంటి నిత్యా" కంపరంగా అడిగాను.

"నేనేం గాసిప్స్ చెప్పడం లేదు. నిజమే చెప్పా" నిత్య చిన్నబుచ్చుకుంటూ చెప్పింది.

మా సీత బాబాయ్ పేరు సీతారాముడు. మా నాన్న తమ్ముడు. చండశాసనుడు. చిన్నప్పుడోసారి నేను ఫ్రెండ్స్‌తో కలిసి కాలువలో ఈతలు కొడుతుంటే అటుగా పోతున్న బాబాయ్ చూసి నన్ను నీళ్ళల్లోంచి లాగి బట్టలు వేసుకోగానే టైం కూడా ఇవ్వకుండా అక్కడినించి ఇంటిదాకా కొట్టుకుంటూ తీసుకొచ్చి 'ఏవమ్మా వదినా వీడేం చేసాడో చూసావా?' అంటూ అమ్మకి చెప్పి ఇంకో రెండు దెబ్బలు కొట్టి వెళ్ళాడు. అప్పటినించి బాబాయంటే నాకు చచ్చేంత భయం. వాళ్ళ పిల్లలు కూడా ఏం కావాలన్నా పిన్నికి చెప్పి, ఆమె వెనక దాక్కుని వాళ్ళ నాన్నని అడిగేవారు తప్ప ముఖాముఖి మాట్లాడేవారు కాదు. అంత కోపిష్టి. అలాంటి బాబాయ్‌కి గర్ల్ ఫ్రెండ్ అంటే నాకు రుచించలేదు.

"మీ అమ్మ చెప్పారనుకున్నా" నిత్య గొణిగింది.

"ఇది తల్లి కొడుక్కి చెప్పే విషయమా?" అరిచాను.

నిత్య లేచి నుంచుంది.

"ఇవాళ సీనియర్ ఇంటర్ వాళ్ళకి స్పెషల్ క్లాస్ తీసుకోవాలి. వెళ్దామా? నేను పుకార్లు చెప్పలేదని నిర్ధారణ అయ్యాక అప్పుడు కలుద్దాం. నిన్ను డ్రాప్ చేయాలా?" ముభావంగా అడిగింది.

"వద్దులే. నడిచి వెళ్ళిపోతా. నువ్వెళ్ళిపో" చెప్పాను.

మా సమావేశం ఎప్పుడూ మధ్యాహ్నంలోగా ముగిసేదికాదు. ఏవేవో కబుర్లు, భవిష్యత్తు గురించిన కలలతో కాలం ఎలా సాగిపోయిందో తెలిసేదికాదు. అలాంటిది ఇవాళ పావుగంటలోపే నిత్య వెళ్ళిపోయింది. స్పెషల్ క్లాస్ అనేది అబద్ధమని ఇద్దరికీ తెలుసు.

నేను నెమ్మదిగా లేచి ఆంజనేయస్వామిని చూసి, ఓ దణ్ణం పెట్టి గుళ్ళోంచి బయటకి వచ్చాను. నిత్య నిజమే చెప్పిందేమో? ఆవేశపడకుండా వివరాలు అడగాల్సింది అనుకున్నాను.

"ఏంటిరా అప్పుడే వచ్చావు? టిఫిన్ తిన్నావా? పోనీ రెండు దోసెలు వేసివ్వనా?" అమ్మ అడిగింది.

"వద్దు. ఆకల్లేదు" చెప్పి టి.వి చూడసాగాను. అనవసరంగా వచ్చానేమో అనిపించింది. బాబాయ్ గురించిన వార్త, నిత్యతో గొడవ. నా మనసు చికాగ్గా ఉంది. ఎప్పుడు ఇంటికి వచ్చినా కాలం పరిగెత్తుతుంది. అమ్మతో కబుర్లు, నిత్యతో

గడిపే క్వాలిటీ టైం కోసం నెలకోసారి నాలుగువందల కిలోమీటర్ల ప్రయాణించి వస్తాను. ఈసారి నా తొందరపాటు తనంతో నిత్యని నొప్పించాను. మళ్ళీ ప్రసన్నం చేసుకోవాలి. ఎంత బతిమాలాలో ఏమో?

"నెలకోసారి నాకోసం అంత దూరంనించి వస్తున్నావు నాకు మాత్రం ఇక్కడ బంధం ఏముంది? సర్దుకుని ఈసారి వచ్చినప్పుడు నీతో వచ్చేస్తా. నీకీ తిరుగుడు తప్పుతుంది" అమ్మ గోరు చిక్కుడుకాయలు తరుగుతూ చెప్పింది.

అమ్మకి నిత్య గురించి చెప్పాల్సిన సమయం వచ్చిందని నాకర్థమైంది. కానీ తనని వెంటనే చూడాలంటే ప్రాబ్లం. నిత్య అలిగితే ఫోన్ స్విఛాఫ్ చేస్తుంది. నాకోపం బాబాయ్ మీదకి మళ్ళింది. రిటైరైన వాడికి ఇప్పుడు గర్ల్ ఫ్రెండ్ ఏమిటో అనుకున్నాను.

భోజనం అయ్యాక బాబాయ్ ఇంటికి బయలుదేరాను. తలుపులు తీసే ఉన్నాయి. టి.వి మోగుతోంది.

"పిన్నీ" పెద్దగా పిలిచాను.

"ఎవరూ?" పిన్ని అన్నం చేత్తో బయటకి వచ్చింది.

"నువ్వా? ఎప్పుడొచ్చావురా? మీ అమ్మ కులాసానా? ఒకే ఊరిలో ఉన్నామన్న మాటేగాని కలుసుకోడం ఎక్కడా? ఫోన్లే" పిన్ని మాట్లాడుతూనే లోపలకి దారితీసింది.

"బాబాయ్ లేడా పిన్నీ?" చుట్టూ చూస్తూ అడిగాను.

"వచ్చే టైమైంది. కూర్చో. భోం చేసావా?" పిన్ని ఆప్యాయంగా అడిగింది.

"తినేసే వస్తున్నా. నువ్వు తినెయ్. ఈలోగా పేపర్ చదువుకుంటా" టీపాయ్ మీదున్న ఈనాడు అందుకున్నాను.

నిత్య చెప్పింది నిజమే అయితే మరి పిన్ని భోరున ఏడవాలి కదా? బాగానే ఉందే అన్నం తింటూ టి.వి చూస్తోంది. అది పుకారే అనుకున్నాను.

అరగంటలో బాబాయ్ వచ్చాడు. ఏభైలలో ఉన్నట్లు ఉన్నాడు కాని రిటైరైన సిక్స్టీ ప్లస్ లాగా లేనే లేడు. ఆయనకన్నా నేనే లావుగా ఉన్నానేమో అనిపించింది. అమ్మ చెప్పింది నిజమే.

"ఏరా చంద్రం ఎలా ఉన్నావు? రంగొచ్చావురోయ్. గుజరాత్ నీళ్ళు పడ్డాయి" ఆప్యాయంగా కౌగలించుకున్నాడు.

సాయంత్రం ఐదింటిదాకా బాబాయ్‌తోనే గడిపాను. ఐదున్నరకాగానే బాబాయ్ లేచి చెప్పాడు.

"నాకు పనుందిరా చందూ. బయటకి వెళ్ళొస్తా మీ పిన్నితో మాట్లాడ్తూ వుండు"

"రిటైరైన వాడికి పనేంటి బాబాయ్" నవ్వుతూ అడిగాను.

"ఇదిగో తలుపేసుకో" చెప్పి బాబాయ్ నాతో బయటకి వచ్చాడు.

"నీ ప్రశ్న నా కర్థమైందిరా. ఊళ్ళోకి దిగగానే నా గురించి ఊదేసారన్నమాట. ఎవరు? వదిన చెప్పదు. నిత్య చెప్పిందా?" అడిగాడు.

నేను మౌనంగా ఉండిపోయాను.

"త్రివేణికి పనుల్లో హెల్ప్ చేస్తుంటే నిత్య కిటికీలోంచి చూసిందిలే. వాళ్ళింటి వెనకున్న ఫ్లాట్స్‌లోనే త్రివేణి ఉంటుంది."

"త్రివేణి ఎవరు బాబాయ్?" అప్రయత్నంగా అడిగాను.

ఆయన మౌనంగా బైక్ స్టార్ట్ చేసాడు. నేను వెనక కూర్చున్నాను. బైక్ మా ఊళ్ళో కొత్తగా కట్టిన ఓ అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ ముందు ఆగింది. బాబాయ్ దాన్ని లాక్ చేసి లోపలకి నడిచాడు. నేను ఆయన్ని వెంబడించాను. బాబాయ్ సెకండ్ ఫ్లోర్‌లోని ఓ ఫ్లాట్ ముందు ఆగి జేబులోంచి ఓ తాళం చెవి తీసి, దాని తలుపు తెరిచాడు.

"రారా" లోపలికి వెళ్తూ ముందు గది సోఫాలో పడేసున్న చున్నీని ఓ చేత్తో, టీపాయ్ మీద ఎండిపోయి వున్న కాఫీ కప్పుని ఓ చేత్తో పట్టుకుని లోపలకి నడిచాడు.

కప్పుని సింక్‌లో పెట్టి అందులో నీళ్ళు నింపి, చున్నీని మడతలు పెట్టి, ఓ గదిలోకి వెళ్ళి ఉత్త చేతులతో బయటకి వచ్చాడు

నాకు తెలిసి బాబాయ్ ఇలాంటి పనులు ఎప్పుడూ చేయలేదు. శుభ్రతకి ప్రాణమిచ్చే ఆయన ఏదైనా అశుభ్రంగా కనిపిస్తే 'ఆడవాళ్ళు ఆ మాత్రం చూసుకోనక్కర్లా?' అంటూ పిన్నిని అరిచి ఆమె చేతే ఆ పని చేయించేవాడు. ఇక్కడ ఇలా ఎవరో ఇంట్లో... నాకు చేదు తిన్నట్లుగా అనిపించింది.

బాబాయ్ చకచకా కాఫీ కలిపి, రెండు కప్పుల్లో పోసి తెచ్చి నాకు ఒకటి ఇచ్చి చెప్పాడు.

"ఒక వయసు వచ్చాక కొడుకుని స్నేహితుడిలా చూడాలట. వదినకి తెలియకుండా నిత్యతో నీ తిరుగుళ్ళు నాకు తెలుసుకాబట్టి, నువ్వు ఆ వయసుకి వచ్చినట్లే. ఒక ఫ్రెండ్‌గా నీకు నా గురించి చెప్తాను."

నేను కాఫీ ఓ గుటక వేసి రుచిని మనసులోనే మెచ్చుకున్నాను.

"ఇక నా వయసు గురించి. అరవై రెండు. చిరంజీవిలాంటి హీరోలు రత్తాలు, బొత్తాలు అంటూ డాన్స్ వేస్తే మీకు నచ్చుతుంది. నేను ఆయనకంటే చిన్నవాడిని. చిన్నప్పటినించి క్రమశిక్షణతో శరీరాన్ని ఓ పద్ధతిలో ఉంచినవాడ్ని. రిటైరైనంత మాత్రాన 'కృష్ణా రామా' అనుకోవాలా? నాకు ఎన్ని తీరని కోరికలున్నాయో తెలుసా?"

నేను ఆయన వంక ఆశ్చర్యంగా చుసాను. బాబాయ్‌లోని ఈ కోణం నాకు తెలీదు.

"నాకు పెళ్ళాం ఇలా ఉండాలి అని కొన్ని కలలుండేవి. సరదాగా ఉండాలి. సరసంగా ఉండాలి. స్పాంటేనియస్‌గా రెస్పాండ్ అవాలి. కానీ మీ పిన్నిలో అబ్బే అవేం లేవు. చాలా మంచి పిల్ల. అమాయకురాలు. పొరపాటున నువ్వు అని సంబోధిస్తే, చెంపలు వేసుకుంటుంది. పడకగదిలో కళ్ళు మూసుకుని ఉంటుంది. నన్ను బాగా ప్రేమిస్తుంది. కాని దాన్ని సరైన పద్ధతిలో వ్యక్తీకరించడం చేతకాదు. నాకు ఈ విషయంలో చాలా అసంతృప్తి. కానీ తప్పదుగా. అలాగే కాపురం చేసా. ఆ అసంతృప్తి ఇతర విషయాల మీద ప్రభావం చూపించేది. అందుకే మీ అందరికీ సీత బాబాయ్ అంటే హడల్. ఆడపిల్లలైనా మా పిల్లలకి కూడా అప్పుడప్పుడు గట్టిగానే తగిలేవి దెబ్బలు."

బాబాయ్ మా ఇద్దరి ఖాళీ కప్పులని తీసుకెళ్ళి సింక్‌లో శుభ్రంగా కడిగి బోర్లించాడు.

"నాలుగు నెలల్రకితం నాతో పనిచేసి రిటైరైన స్నేహితుడు ఒకాయన నాకు ఫోన్ చేసాడు. తనకి తెలిసిన త్రివేణి అనే అమ్మాయికి మన ఊరు బ్రాంచ్‌కి ట్రాన్స్‌ఫర్ అయిందని, తెలుగురాని ఆ అమ్మాయికి లోకల్ గార్డియన్‌గా హెల్ప్ చేయమని కోరాడు.

త్రివేణికి నలభై ఐదేళ్ళు. కుటుంబ పరిస్థితులవల్ల పెళ్ళికాలేదు. జీవితంలో ఢక్కామొక్కీలు తినడంతో తెలివితేటలు, లౌక్యం చాలా ఎక్కువ. చలాకీ కూడా. నేనే లొంగిపోయానో, తనే లొంగదీసుకుందో తెలీదు కానీ నేనిప్పుడు తనతో గాఢంగా ప్రేమలో ఉన్నానురా. భార్యలో నేను కోరుకున్న లక్షణాలన్నీ త్రివేణిలో ఉన్నాయ్" బాబాయ్ పారవశ్యంగా చెప్పాడు.

"మరి ఆవిడకి ఇంకో ఊరు ట్రాన్స్‌ఫరైతే నువ్వూ వెళ్తావా బాబాయ్?"

"వెటకారం అర్థమైంది."

"లేకపోతే ఏంటి బాబాయ్. పిన్నికి కూడా నీలా చాలా కోరికలుండి వుంటాయి. దుర్వాసుడిలాంటి నీతో నిశ్శబ్దంగా కాపురం చేయడంలేదా? నువ్వు తప్పు చేసి మళ్ళీ బ్లేమ్ పిన్నిమీదే వేస్తున్నావు. నువ్వు మంచివాడివి కాదు. ఇంతకాలం నీ వ్యామోహాన్ని అణిచిపెట్టుకున్నావు. అవకాశం దొరగ్గానే పిన్నిమీద నిందవేసి మోజు తీర్చుకుంటున్నావు. నీ ప్రేయసి ఇంట్లో పనివాడిలా సిగ్గులేకుండా పనిచేస్తున్నావు. ఆవిడకి అంతగా లొంగిపోయావు. నీ మీదున్న భయం, భక్తి, ప్రేమ అన్నీ పోయాయి. దయచేసి ఇంక నాతో మాట్లాడొద్దు బాబాయ్" కోపంగా చెప్పి బయటకి వచ్చాను.

నాకు బాబాయ్ మీద అసహ్యం వేసింది. ఆఫీసర్‌గా రిటైరై పులిలా దర్జాగా ఉండే బాబాయ్ ఒక ఆడదాని కోసం చున్నీలు మడతపెడుతూ, ఎంగిలి కప్పులు కడుగుతూ ఏ స్థాయికి దిగజారిపోయాడో కదా అనిపించింది.

ఇంటివైపు నడుస్తూంటే ఫోన్ మోగింది. నిత్య.

నాకు ఆశ్చర్యమేసింది. అలిగినప్పుడు వారం పదిరోజులు ఫోన్ లిఫ్ట్ చేయని నిత్య తనంతట తనే మాట్లాడాలనుకుందా?

"చెప్పు"

అవతలి నించి నవ్వు వినిపించింది.

"అప్పుడే వెళ్ళిపోయావే? కొద్దిసేపుంటే మీ కొత్తపిన్నిని చూసేవాడివిగా?"

"ఎప్పుడూ వెనకింట్లో పక్కింట్లో తొంగి చూడడమేనా పని? నీ సంగతి చూసుకో" విసురుగా చెప్పాను.

"నాకేం బ్రహ్మాండంగా వున్నాను. మీ బాబాయ్ ఇప్పుడే బాల్కనీలోకి వచ్చి ఆరేసిన బట్టలు తీసి పొందికగా మడతలు పెడుతున్నాడు. నీకిదే చెప్తున్నా మన పెళ్ళయ్యాక నువ్వూ ఈ పనులన్నీ చేయాలి. కావాలంటే మీ బాబాయ్ దగ్గర ట్రైనింగ్ తీసుకో. ఆయన చక్కగా కిచెన్‌లోకి వచ్చి చపాతీకి పిండి కలుపుతున్నాడు. మా డాబామీద నుంచుంటే మీ పిన్ని వాళ్ళ హాల్, కిచెన్ మా ఇంట్లోవే అన్నంత బాగా కనిపిస్తాయి తెలుసా? అన్నట్లు నాకు చపాతీలు వద్దులే. అన్నం వండితే చాలు" పగలబడి నవ్వుతోంది నిత్య.

"షటప్" అరిచి కాల్ కట్ చేసాను.

రాత్రంతా ప్రయాణం. ఉదయం ఊళ్ళో దిగినప్పటినించి జరిగిన సంఘటనలతో మానసికంగా అలసిపోయాను.

పిన్నిమీద బ్లేమ్ వేసి ప్రేయసికి బానిసైన బాబాయ్. బాబాయ్ ప్రేమాయణాన్ని అవకాశంగా తీసుకుని నామీద పెత్తనం చలాయించాలనుకునే నిత్య. నాకు మానవ సంబంధాల మీదే నమ్మకం పోయింది.

ఇంటికి వెళ్ళేసరికి అమ్మ సంధ్య దీపం పెడుతోంది. నన్ను చూసి నవ్వి దేవుడి గదిలోంచి బయటకి వచ్చి అడిగింది.

"చాలాసేపు కూర్చున్నావే? పిన్ని ఎలా ఉంది కులాసానా? సీతయ్య ఏమంటున్నాడు?"

"అంతా బానే వున్నారమ్మా" చెప్పి నేను ఉయ్యాలబల్ల మీద కూర్చున్న అమ్మ పక్కన కూర్చుని ఆవిడ భుజం మీద తలానించి చెప్పాను.

"నువ్వు చెప్పింది నిజమేనమ్మా. నాన్నలేరు ఇంక మనకీ ఊరితో బంధమేముంది? రెండు రోజులు సెలవు పెడతా సర్దుకుని కలిసి గుజరాత్ వెళ్ళిపోదాం."

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments